అప్రమత్తతే శ్రీరామరక్ష

- నేడు ప్రపంచ క్షయ దినోత్సవం
- అంటువ్యాధితో జాగ్రత్తలు అవసరం


పి.గన్నవరంలో ఏర్పాటు చేసిన టీబీ ప్రత్యేక వైద్య శిబిరం (ఫైల్)

మామిడికుదురు: క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దేశంలో ఈ వ్యాధి నిమిషానికి ఇద్దరికి వ్యాపిస్తోంది. ఈ వ్యాధి బారిన పడిన వారు సక్రమంగా మందులు వాడని పక్షంలో ఏడాదిలోపు ఈ వ్యాధి ఒక రోగి నుంచి 10–15 మందికి సంక్రమించే ప్రమాదం ఉందని చెబుతున్నారు. మార్చి 24వ తేదీ శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

ఈ వ్యాధి లక్షణాలు...

ఇది ఏ వయస్సు వారికైనా సంక్రమించే ప్రమాదం ఉంది. ఇది ఎక్కువగా ఊపిరితిత్తులకు సోకుతుంది. దీనినే శ్వాసకోశ క్షయ అంటారు. రెండు వారాలకు మించిన దగ్గు, రాత్రి పూట జ్వరం రావడం, ఆకలి తగ్గడం, చాతీలో నొప్పి, బరువు తగ్గడం, ఉమ్మిలో రక్తం పడడం, దీని లక్షణాలు. రెండు సార్లు కఫం (తెమడ) పరీక్షలు చేయడం ద్వారా క్షయవ్యాధిని గుర్తిస్తారు. దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రంలో కానీ, ఆరోగ్య కార్యకర్తని కానీ, ప్రభుత్వాస్పత్రిలో కానీ సంప్రదించి అనుమానితులు పరీక్ష చేయించుకోవాలి. ఈ వ్యాధి సూక్ష్మక్రిములు ద్వారా సోకుతుంది. వయస్సుతో నిమిత్తం లేకుండా ఏ వయస్సు వారికైనా ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. క్షయవ్యాధి గ్రస్తులు తుమ్మినప్పుడు సన్నని తుంపర్లు ద్వారా ఆరోగ్యవంతులకు ఇది సోకుతుంది.

తీసుకోవల్సిన జాగ్రత్తలు...

పుట్టిన వెంటనే పసిబిడ్డలకు బీసీజీ సూది మందు వేయించాలి. దగ్గు వచ్చినప్పుడు నోటికి గుడ్డ అడ్డుగా పెట్టుకోవాలి. క్షయరోగి ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదు. మందులు సక్రమంగా వాడాలి. ఈ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా డాట్స్ ద్వారా క్రమం తప్పకుండా మందులు వాడాలి. అన్ని ప్రభుత్వాస్పత్రులో దీని నివారణకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. రోగులు ఆరునెలల పాటు మందులు వాడాలి. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాధి బారిన పడిన రోగులకు పోషకాహారం కోసం నెలకు రూ.500 వంతున సహాయం అందిస్తోంది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో గత ఏడాది వరకు 731 క్షయవ్యాధి కేసులు నమోదు అయ్యాయి. ఈ ఏడాది కొత్తగా 127 కొత్త కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 858 క్షయ వ్యాధి కేసులు నమోదయ్యాయి. ఒక నియోజకవర్గాల వారీగా పరిస్థితి ఇదీ. కొత్తపేట నియోజకవర్గంలో గత ఏడాది నాటికి 253 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది కొత్తగా మరో 48 కేసులు వెలుగు చూశాయి. రాజోలు నియోజకవర్గంలో పాత కేసులు 210 కాగా, ఈ ఏడాది 32 కేసులు నమోదయ్యాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో గత ఏడాది 268 టీబీ కేసులు ఉండగా ఈ ఏడాది 47 కొత్త కేసులు వెలుగు చూశాయి. టీబీపై ప్రజల్లో అవగాహన కల్పించి దీని నివారణకు పక్కాగా చర్యలు తీసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

యువత క్రీడలపై ఆసక్తి కనబర్చాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: యువత క్రీడలపై ఆసక్తి కనబర్చి దేశానికి మంచి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి యువతకు సూచించారు. ఆయన మండలంలోని ర్యాలిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ లెవెల్ ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలకు హాజరయ్యారు. విజయనగరం–కృష్ణా జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌ను తిలకించారు. క్రీడాకారులను కలసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రీడాకారులతో వాలీబాల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. యువత పెడదోవ పట్టకుండా ఇలాంటి దేహదారుఢ్యాన్ని, నైపుణ్యాన్ని, పేరు ప్రతిష్టలను పెంచే ఆటల పోటీలు నిర్వహిస్తున్న పాలింగి చిట్టిరాజును అభినందించారు. అలాగే విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, జెడ్పీటీసీ బోణం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి


తాటిపాకలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

రాజోలు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి క్రైస్తవులంతా కృషి చేయాలని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబురావు పిలుపునిచ్చారు. గురువారం తాటిపాకలోని ఫెయిత్ అండ్ పవర్ రివైవల్ చర్చిలో రాజోలు, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు చెందిన 13 మండలాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుల నియామకం, నూతన కార్యవర్గ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా నాయకులు డాక్టర్ వి.శామ్యూల్ జ్యోతి, ఎం.స్వర్ణస్‌రాజు, వైప రంజ్యోతి, సీహెచ్ స్టీవెన్, ఎస్.శామ్యూల్, అంబటి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ప్రభుత్వం పాడి రైతులకు సులభంగా సేవలు అందించేందుకు అంబులెన్స్ సేవలు ప్రారంభించినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని ర్యాలిలో రూ.29 లక్షలు విలువైన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కొత్తపేట నియోజకవర్గంలో రూ.29 లక్షలు విలువైన అంబులెన్స్ మంజూరు చేయగా పాడి రైతులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 1962 నంబర్‌కు కాల్ చేయగా రైతులకు అందుబాటులో ఉంటూ హైడ్రాలిక్ ఎక్విప్‌మెంట్ సహాయంతో ఆవులు, గేదెలు, లాంటి పశువులను సునాయసంగా హాస్పిటల్‌కు తరలించడంతో సహాయ పడుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ర్యాలిలో పలు రోడ్లను ప్రారంబించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ పీఎస్ రెడ్డి జయపాల్, దేవస్థానం మాజీ చైర్మన్ మైనర్ సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ ఈలి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.34.99 లక్షల రుణాలు


నగరం సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ ఆదిత్యకుమార్

మామిడికుదురు: నగరం నైనాల గణేశ్వరరావు పీఏసీఎస్ మహా జనసభ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్ అధ్యక్షతన గురువారం జరిగింది. స్థానిక సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా ఆదాయం రూ.68.23 లక్షలు, అంచనా వ్యయం రూ.65.22 లక్షలు, అంచనా లాభం రూ.3.01 లక్షలతో అంచనా బడ్జెట్‌ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్మన్ ఆదిత్యకుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది స్వల్పకాలిక రుణాలుగా 17 మంది రైతులకు రూ.34.99 లక్షలు, దీర్ఘకాలిక రుణాలుగా 12 మంది రైతులకు రూ.27.15 లక్షలు అందించామన్నారు. సొసైటీ ద్వారా రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా కార్యాచరణ చేపట్టామన్నారు. మహాజన సభలో సభ్యులు, ఎంపీటీసీ వర్ధినేని రాము, మాజీ సర్పంచ్ నయినాల సత్యనారాయణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన

అలమూరు: మండలంలోని జొన్నాడలో రూ.లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు పనులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గ్రామ ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుంది. రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ

అలమూరు: మండలంలోని చింతలూరులో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ శుక్రవారం జరగనుంది. కరకుదురుకు చెందిన వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు మంత్రోచ్ఛారణల మధ్య పురోహితుల బృందం ఈ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠ చేయనుంది. ఇప్పటికే ఆ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించగా ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో విగ్రహాలకు క్షీరాధివాసం, జలాధివాసం, వాస్తుపూజ నిర్వహించారు. ఈనెల 26 నుంచి వారం రోజుల పాటు శ్రీరామ సప్తాహాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

డంపింగ్ యార్డ్‌కు స్థలాన్ని కేటాయించాలి


అంబాజీపేటలో ఆర్డీవో ముక్కంటికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

అంబాజీపేట: గ్రామంలో సేకరించిన చెత్తను వేసేందుకు డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే స్థలాన్ని కేటాయించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిలు కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటికి వివరించారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో మాచవరం పంచాయతీకి సంబంధించి చెత్త వేసేందుకు స్థలాన్ని ఏర్పాటు చేయాలంటూ వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. మాచవరంలో చెత్త నుంచి సంపద కేంద్రానికి, అంబాజీపేట హడ్కో కాలనీ శివారు కౌశిక ప్రాంతంలో చెత్త వేసేందుకు వెళ్లిన ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకుంటున్నారని ఈ విషయాన్ని డీఎల్పీఓకు వివరించామన్నారు. నెల రోజులు గడిచినా చెత్త వేసుకునేందుకు స్థలం చూపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే ప్రభుత్వ స్థలాన్ని ఏర్పాటు చేసి చెత్త సమస్యను పరిష్కరించాలని ఆర్డీవోను కోరారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ టి.మంగతాయారు ఉన్నారు.

దంతాలను సంరక్షించుకోవాలి


పుల్లేటికుర్రులో విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డెంటిస్ట్ మణిప్రకాష్

అంబాజీపేట: ప్రతి ఒక్కరికీ దంతాలు ఎంతో అవసరమని వాటిని పరిశుభ్రంగా ఉంచుకుంటూ సంరక్షించుకోవాలని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబులు అన్నారు. అంబాజీపేట కేపీ దంత వైద్యశాల వైద్యాధికారి దంగేటి కుమార్ మణిప్రకాష్ ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత దంత శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం పళ్లను బ్రష్ చేయడం వల్ల ఎటువంటి రోగాలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కాండ్రేగుల గోపాలకృష్ణ, అందె వెంకటముక్తేశ్వరరావు, నందుల ఆదినారాయణ, మద్రి ఏడుకొండలు, దొమ్మేటి సురేష్, ఆకెళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక దర్శనానికి భక్తుల తాకిడి


చింతలూరులో బారులు తీరిన భక్తులు

అలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతుంది. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమైన నాలుగో రోజు గురువారం భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో క్యూలు కిక్కిరిసి పోయి భక్తులు బారులు తీరారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. చిన్నారులు, బాల, బాలికలు జెయింట్‌వీల్, రంగులరాట్నం ఎక్కేందుకు ఎగబడ్డారు. తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును కొనసాగిస్తున్నారు. పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తున్నారు.

మలికిపురం: మండలంలోని గూడపల్లిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి తీర్థం ఘనంగా ప్రారంభమైంది. వచ్చే ఏప్రిల్ 19వ తేదీ వరకూ సుమారు నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ నెల రోజుల పాటు పలు కుటుంబాల ఆధ్వర్యంలో ప్రత్యేక సేవలు నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ఇంటి ఆడపడుచులు కూడా దూరప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు


కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదు

మామిడికుదురు/కొత్తపేట: ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ ఉపవాస దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ దీక్షలు గురువారం రాత్రి నెలవంక దర్శనంతో ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా 30 రోజుల పాటు ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ప్రతి రోజూ ఉదయం తెల్లవారు జామున 4.30 గంటలకు 'సహరి'తో ప్రారంభమయ్యే ఈ దీక్షలు సాయంత్రం 6.20 గంటలకు 'ఇఫ్తార్'తో ముగుస్తాయి. రంజాన్ ఉపవాస దీక్షల కోసం మండలంలోని మామిడికుదురు, నగరం, కొమరాడ, మగటపల్లి, మొగలికుదురు, పెదపట్నం గ్రామాలు, కొత్తపేటలోని కమ్మిరెడ్డిపాలెం మసీదులను సుందరంగా అలంకరించారు. విద్యుత్‌దీపాల కాంతులతో వాటిని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. 'అల్లా'కు అత్యంత ప్రీతికరమైన మాసంగా 'రంజాన్' ప్రాచుర్యం పొందింది. మానవజన్మను ప్రసాదించిన అల్లాకు కృతజ్ఞతలు తెలుపుకునే అరుదైన అవకాశం ఈ రంజాన్ ప్రార్థనల ద్వారానే లభిస్తుందని ముస్లింలు ప్రగాఢంగా విశ్వసిస్తారు. రంజాన్ దీక్షల్లో భాగంగా రోజుకు అయిదు పర్యాయాలు నమాజ్ ప్రార్థనలు, రాత్రి 'ఖురాన్' పఠనం నిర్వహిస్తారు. మహిళలు సైతం రంజాన్ ఉపవాస దీక్షలు పాటిస్తారు. 30 రోజుల రంజాన్ దీక్షల అనంతరం భక్తుడు అప్పుడే తల్లి గర్భం నుంచి పుట్టిన ఏ పాపం ఎరుగని నవజాత శిశువులా మారతాడని ముస్లింల నమ్మకం. అందుకే ప్రతి ఒక్కరూ కఠోర నిష్ఠతో రంజాన్ దీక్షల్లో పాల్గొంటారు. ఈ దీక్షల్లో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొంటారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట: స్థానిక 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు నిమిత్తం మండలంలోని బిళ్లకుర్రు, వానపల్లి, అవిడి, మోడేకుర్రు, పలివెల, గంటి గ్రామాలతో పాటు మండల కేంద్రం కొత్తపేటలో పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

పి.గన్నవరం: విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా నరేంద్రపురం 33 కేవీ సబ్‌స్టేషన పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం, పప్పులవారిపాలెం, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, గంటి పెదపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సామాజిక సేవకు ఓఎన్జీసీ ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్

రాజోలు: ఓఎన్జీసీ సామాజిక సేవకు అధిక ప్రాధాన్యమిస్తుందని రాజమహేంద్రవరం ఓఎన్జీసీ అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. గురువారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.10 లక్షలతో ఓఎన్జీసీ సమకూర్చిన డ్యూయల్ డెస్క్‌లను అసెట్ మేనేజర్ అమిత్‌నారాయణ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సాయిబాబా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓఎన్జీసీ సామాజిక బాధ్యతగా విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కళాశాలలో టాయిలెట్స్, జిమ్, స్పోర్ట్స్ అభివృద్ధికి సహకరించాలని కళాశాల విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ఓఎన్జీసీ సర్‌ఫేస్ మేనేజర్ డీప సుబ్బరాజు, పి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం


కొత్తపేటలో దొమ్మేటి వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

కొత్తపేట: శెట్టిబలిజ జాతి ఔన్నత్యం కోసం అహర్నిశలు శ్రమించిన మహాయోధుడు, గొప్ప సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి చిరస్మరణీయుడని శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాల్ వద్ద వెంకటరెడ్డి విగ్రహానికి రెడ్డి సుబ్రహ్మణ్యం, పలువురు శెట్టిబలిజ నాయకులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో కుడుపూడి సత్తిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి రామకృష్ణ, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, వైఎస్సార్ సీపీ నాయకులు దూనబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి వెంకటేశ్వరరావు పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

తాటిపాక సెంటర్‌లో..

రాజోలు: శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి గురువారం తాటిపాక సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గుబ్బల మనోహర్, బాబ్జి, శ్రీనివాస్, కట్టా ఉమామహేశ్వరరావు, బొంతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరప్పాడులో..

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో గురువారం శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద స్థానిక శ్రీరామ శెట్టిబలిజ సంఘ సభ్యులు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

భగత్‌సింగ్ వర్ధంతిలో సాయిమాధవ్

మలికిపురం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల వర్ధంతి గురువారం దిండి గ్రామంలో జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ సినీమాటల రచయిత బుర్రా సాయిమాధవ్ పాల్గొని వారి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

స్వామి సన్నిధిలో మాజీ ఎంపీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం నరసాపురం మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం బాపిరాజు దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

టెండర్ కం బహిరంగ వేలం

అంతర్వేది దేవస్థానంలో షాపుల లీజు, వివిధ లైసెన్స్ హక్కుల నిమిత్తం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించినట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ గురువారం చెప్పారు. ఈ క్రమంలో ఎండోమెంట్స్ ఈవో టి.నాగవిష్ణు పర్యవేక్షణలో షాపు నెం.4 నందు ఫొటోలు, ఫ్యాన్సీ సామగ్రి ఒక సంవత్సరం అమ్ముకునే హక్కుకై రూ.12 లక్షలకు టెండర్ ఖరారైనట్టు ఆయన తెలిపారు.

యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

పి.గన్నవరం: విద్యార్థులు, యువత తమ తెలివిని పెట్టుబడిగా పెట్టి స్వయం ఉపాధి రంగాలవైపు దృష్టి సారించి, యువ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని స్వావలంబ్ భారత్ అభియాన్ ఏపీ ప్రాంత కన్వీనర్ గన్నవరపు అంజనీ శ్రీనివాస్ అన్నారు. పి.గన్నవరంలోని లక్ష్మీ ఐటీఐ కళాశాలలో గురువారం కళాశాల ఇన్‌చార్జి ఆదిత్య అధ్యక్షతన జరిగిన సంకల్ప దివస్ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. విప్లవ వీరులు రాజ్‌గురు, సుఖ్‌దేవ్, భగత్‌సింగ్‌ల వర్ధంతి సందర్భంగా, స్వాతంత్ర్య సంగ్రామంలో వారు పోషించిన వీరోచిత పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు. స్వావలంభి అభియాన్ (ఎస్‌బీఏ) దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువతలో ఉద్యోగాలు సాధించే విషయమై పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రతి జిల్లా కేంద్రంలో జిల్లా ఉపాధి కల్పనా అవగాహన కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏపీలో ఇప్పటికే 10 జిల్లా కేంద్రాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న తరహా పరిశ్రమల స్థాపన విషయంలో శిక్షణ ఇచ్చి చైతన్య పరుస్తున్నామని శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఏ కోనసీమ జిల్లా కేంద్ర ఇన్‌చార్జి కటికిరెడ్డి గంగాధర్, ఉపాధి కల్పన అవగాహన కేంద్రం సంరక్షక్ మెడికల్ డిస్ట్రిబ్యూటర్ చిలకమర్తి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాపీ మేస్త్రిల సంక్షేమ సంఘ సమావేశం

సఖినేటిపల్లి: స్థానిక ముత్యాలమ్మ అమ్మవారి తాపీ మేస్త్రిల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం గురువారం సఖినేటిపల్లిపాలెం సెంటర్లో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మెర్ల తులసీనాథ్ అధ్యక్షతన జరిగిన పై సమావేశంలో మొదటి వార్షికోత్సవ కేక్ కట్ చేశారు. సంఘపరంగా సభ్యుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. సమావేశంలో సభ్యులకు సంఘ గుర్తింపు కార్డులను, ప్రమాద భీమా కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

31న సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు

సఖినేటిపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకంలో పూర్తి చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఇచ్చే నివేదికపై ఈ నెల 31 మండల పరిషత్ కార్యాలయం వద్ద సమీక్షించనున్నట్టు ఎంపీడీవో జి.భీమారావు గురువారం అన్నారు. ఈ పథకంలో 2021 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2022 మార్చి 31 వరకూ జరిగిన పనులకు సంబంధించి 15వ విడతగా సామాజిక తనిఖీ బృందం ఈ నెలలో 30వ తేదీ వరకూ వివిధ గ్రామాల్లో పనులపై తనిఖీలు చేపడుతుందన్నారు. బృందం సభ్యులు ఇచ్చే తుది నివేదికను మండల పరిషత్ కార్యాలయం వద్ద 31న ఏర్పాటు చేసే సామాజిక తనిఖీ ప్రజావేదికపై సమీక్షిస్తామన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువకులు

అంబాజీపేట: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు నిలుపుతామని అంబాజీపేట స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, ఆయుర్వేద ఫిజియోథెరపీ వైద్యుడు యోగా శ్రీనివాస్ అన్నారు. స్థానిక యోగా కేంద్రంలో రక్తదానంపై యువకులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం ఆస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న వారికి, గర్భిణులకు 10 మందికి తన తోటి మిత్రులతో రక్తదానం చేయించారు. మీసాల సతీష్, సురవరపు భాస్కర్, ఎస్.ప్రవీణ్, ఎం.దుర్గారావు, పి.అనిల్, ఎం.సుధాకర్, ఎస్.ప్రసాద్, పి.బాలు రక్తదానం చేసిన వారిలో ఉన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించడమే సీఎం జగన్ లక్ష్యమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అందించే రాగిజావ పంపిణీని గురువారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాగిజావను విద్యార్థులు తాగి మంచి ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. అంతకుముందు విద్యార్థులు రాగిజావ తాగేందుకు అవసరమైన స్టీల్ గ్లాసులను హైస్కూల్‌కు ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సూదాబత్తుల రాము, ఉపాధ్యాయులు ఎంఎస్ శ్రీనివాస్, వెన్నపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.30 వేల సాయం


ఆర్థిక సహకారం అందిస్తున్న అగ్నికుల క్షత్రియ ఎన్నారై సభ్యులు

రాజోలు: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న సోంపల్లి గ్రామానికి చెందిన మసకపల్లి అలేఖ్యకు అగ్నికుల క్షత్రియ కువైట్ ఎన్నారై సేవా సమితి రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. గురువారం ఈ సాయాన్ని అగ్నికుల క్షత్రియ నాయకుడు బర్రే శ్రీను పంపిణీ చేశారు. రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు రూ.5 వేలు విలువ చేసే డ్రైఫ్రూట్స్, నిత్యావసరాలు సమకూర్చారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ నాయకుడు బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు, అగ్నికుల క్షత్రియ కువైట్ ఎన్నారై సేవా సమితి ప్రతినిధులు తారాడి శివ, కేవీ రాజు, కొప్పాడి దుర్గారావు పాల్గొన్నారు.

కేశవస్వామి హుండీల ఆదాయం రూ.6.55 లక్షలు

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి హుండీలను గురువారం ఆలయ ఆవరణలో లెక్కించగా రూ.6,55,517 ఆదాయం వచ్చినట్లు ఈవో బి.కృష్ణ చైతన్య తెలిపారు. 5 నెలల 11 రోజులకు గాను లెక్కించగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి ఆలయం హుండీలను 2 నెలలుకు లెక్కించగా రూ 1,29,359 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమం వెలిచేరు గ్రూపు దేవాలయం ఈవో ఆకుల సత్యవర్ధనరావు పర్యవేక్షణలో లెక్కించినట్లు తెలిపారు.